సాక్షి
చిత్తూరు
ఆదివారం । 1 । జనవరి । 2023


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,000

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	19
తిరుపతి	31	19
తిరుమల	26	15
గూడూరు	31	21
నగరి	32	20



నూతనం.. సైకతం

చిల్లకూరు: నూతన సంవత్సరం సందర్భంగా సముద్ర తీరంలో సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ తనదైన శైలిలో శుభాకాంక్షలు తెలియజేశారు. సం 2023వ సంవత్సరానికి స్వాగతం పలికారు.

నవ శోభితం


తిరుమలలో న్యూ ఇయర్ కాంతులు

పాత పంథాను వదిలేద్దాం..
కొత్త ఆశలకు మోసులెత్తుదాం..
కరోనా కత్తులు దూసినా
నియమాలతో తిప్పికొడదాం..
నిస్పృహ వద్దు..
కార్యాచరణే నీ హద్దు..
ఇష్టంగా శ్రమిద్దాం.. విజయబావుటా ఎగురవేద్దాం..
హ్యాపీ న్యూ ఇయర్


ఎయిర్ బైపాస్ రోడ్డులో యువత సందడి

జిల్లాలో న్యూ ఇయర్ సంబరాలు మిన్నంటాయి. 2023కు గ్రాండ్ వెల్‌కమ్ చెబుతూ యువత సందడి చేశారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత కేక్‌లు కట్‌చేస్తూ సంబరాల్లో మునిగితేలారు. - తిరుమల

సుఖశాంతులతో వర్ధిల్లాలి


కే.నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే.రోజా

తిరుపతి అర్బన్: ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి ప్రజాప్రతినిధులు, అధికారులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. 2023 నూతన ఆంగ్ల సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్తు, అటవీ, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడాశాఖా మంత్రి ఆర్కే.రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలు, డీఆర్వోలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సంపూర్ణ ఆయురారోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. కోవిడ్ నియమ నిబంధనలు పాటిస్తూ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

కుప్పం: ద్రవిడ వర్సిటీలో 2022–23 విద్యాసంవత్సరానికి పీజీ కోర్సులకు ఈనెల మూడో తేదీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఏపీ పీజీసెట్–2022 అర్హత సాధించిన విద్యార్థులు పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం ఉటుందన్నారు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ తెలుగు, ఎంఏ లింగ్విస్టిక్స్, ఎంఏ సీడీఎల్, ఎంఏ ఫోక్లోర్, ఎంఏ హిస్టరీ, ఎంఏ ఫిలాసఫీ, కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు చేపడతామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8331039620 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైకుంఠ ఏకాదశికి అదనపు బస్సులు

తిరుపతి అర్బన్: జనవరి ఒకటి, వైకుంఠ ఏకాదశి పర్వదినాలకు అదనపు బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. జనవరి 1 నుంచి ఈనెల 12వ తేదీ వరకు తిరుమలకు అదనపు సర్వీసులు నడపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైకుంఠ ద్వార దర్శనం..పోటెత్తిన భక్తజనం

వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి సామాన్య భక్తులకు పెద్దపీట వేసింది. తిరుపతిలోని తొమ్మిది కౌంటర్ల ద్వారా ఆదివారం నుంచి భక్తులకు దర్శన టోకెన్లు కేటాయించనుంది. ఈ మేరకు శనివారం రాత్రి నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరడం కనిపించింది. - తిరుమల


అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద దర్శన టోకెన్ల కోసం వేచివున్న భక్తులు

కానుక పెంచెన్

- నేటి నుంచి పింఛన్ కానుక రూ.2,750
- జిల్లాలో 2,67,796 మంది లబ్ధిదారులకు రూ.73.04 కోట్లు
- చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో కార్యక్రమం
- హాజరు కానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్/ చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుకను నేటి నుంచి రూ.2,750 అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అందజేస్తున్న రూ.2,500ను 2023 జనవరి 1 నుంచి రూ.250 పెంచి రూ.2,750గా అందించనుందని తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఉంటుందని, కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, రాజంపేట, చిత్తూరు ఎంపీలు మిథున్‌రెడ్డి, ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం రూ.2,67,796 మంది లబ్ధిదారులకు రూ.73.04 కోట్లు మంజూరైందన్నారు. ఇందులో చిత్తూరులోని 28,903 మంది లబ్ధిదారులకు రూ.7.98 కోట్లు, జీడీ నెల్లూరు 43,381– రూ.11.79 కోట్లు, కుప్పం 36,300–రూ.10.09 కోట్లు, నగరి 23,279– రూ.6.34 కోట్లు, పలమనేరు 44,836– రూ.12.34 కోట్లు, పుంగనూరు 44,181 – రూ.11.98 కోట్లు, పూతలపట్టు 46,916 మంది లబ్ధిదారులు రూ.12.49 కోట్లు లబ్ధిపొందనున్నట్లు ఆయన వెల్లడించారు.

గృహ నిర్మాణాల్లో చిత్తూరు జిల్లా ప్రథమం


తూగుండ్రంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

గంగాధరనెల్లూరు: జగనన్న గృహ నిర్మాణాల్లో చిత్తూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని హౌసింగ్ పీడీ పద్మనాభం తెలిపారు. మండలంలోని తూగుండ్రం, ఆవలకొండ జగనన్న కాలనీల్లో జరుగుతున్న పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 73,628 ఇళ్ల నిర్మాణానికి రూ.1,325 కోట్లు మంజూరైందని, ఇందులో 66,233 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. 17,860 ఇళ్లు పూర్తవగా.. 11,218 ఇళ్లు స్లాబ్‌లెవల్లో, 7,099 ఇళ్లు లెంటిల్ లెవల్లో ఉన్నట్లు వెల్లడించారు. 18,318 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్లో, 11,177 ఇళ్లు బేస్‌మెంట్ కన్నా తక్కువ స్టేజీలో ఉన్నాయన్నారు. పీడీ వెంట ఏఈ శ్రీధర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు గీత, యువరాజ్ ఉన్నారు.

క్లుప్తంగా

కాణిపాకంలో గట్టి బందోబస్తు



బందోబస్తుపై సమీక్షిస్తున్న చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో జనవరి 1న గట్టి బందోబస్తు ఏర్పాటుచేసినట్లు చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం సిబ్బందికి ఆలయంలో విధుల నిర్వహణ బాధ్యతలను వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150మంది సిబ్బంది, రెండు బృందాల స్పెషల్ పార్టీ పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా, స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయ ఈఓ, చైర్మన్‌లు శనివారం ఆలయంలోని క్యూలను, అన్నప్రసాద పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, జనవరి 1, 2న వైకుంఠ ఏకాదశి రోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామివారి దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెండు రోజుల పాటు స్వామివారి ఆర్జిత సేవలు, అంతరాలయ దర్శనం రద్దు చేశామన్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు తప్పని సరిగా మాస్క్ ధరించి రావాలని కోరారు.

2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం

తిరుపతి అర్బన్: ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని జిల్లా వ్యవసాయశాఖ వనరుల కేంద్రం ఏడీ మెరుగు భాస్కరయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చిరుధాన్యాలు పోషక బాండాగారాలుగా అభివర్ణించారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన దిగుబడులు సాధించడానికి చిరుధాన్యాలు ఎంతో దోహద పడుతాయని చెప్పారు.

అర్హులందరికీ పట్టాదారు పాసుపుస్తకం

- శికారీల భూ సమస్య పరిష్కారం
- 92 మందికి 161 ఎకరాలు పంపిణీ చేసిన మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి: అర్హత ఉన్న ప్రతి రైతుకూ పట్టాదారు పాసు పుస్తకం పంపిణీ చేస్తామని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం మూడో రోజు పల్లెబాట కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పలమనేరు ఆర్డీఓ శివయ్యతో కలిసి మండలంలోని 92 మంది షికారీ రైతులకు సంబంధించిన 161 ఎకరాల పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. మూడు దశాబ్దాల కల నెరవేరడంతో షికారీలు సంతోష సాగరంలో మునిగితేలారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ బంజరు భూముల్లో ఉపాధిహామీ పథకం, హార్టికల్చర్, జల ప్రభ, వాటర్ షెడ్ తదితర పథకాల ద్వారా రైతుల భూములను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. పలమనేరు డివిజనల్ పరిధిలోని 1,177 మంది రైతులకు 1,534 ఎకరాలను గుర్తించామని, వీరందరికీ త్వరలో పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. బోర్లు సైతం వేయించి పంటలు సాగుచేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. పట్టాలందుకున్న లబ్ధిదారులకు ఇకపై రైతు భరోసా.. తదితర పథకాలు కూడా అందుతాయన్నారు.



పట్టాల పంపిణీ సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

డ్యాన్స్‌లతో హంగామా

మంత్రి పెద్దిరెడ్డికి షికారీలతోపాటు సర్పంచ్ సోని, ఆమె భర్త మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి డ్యాన్స్‌లు చేస్తూ స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ సందడి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, పాల ఏకరి కార్పొరేషన్ డైరక్టర్ లద్దూరమణ, తహసీల్దార్ మాధవరాజు, ఆర్ఐ సుధాకర్ నాయక్, సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్వో రాజన్న తదితరులు పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

జనరంజకంగా జగనన్న పాలన



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజకంగా పాలన సాగిస్తున్నారని, దేశంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. శనివారం మండలంలోని ధర్మాచెరువు గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి రాజన్న రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, కరువును జయించిన ఆనందంలో రైతుల ఇంట్లో కనిపిస్తోందని చెప్పారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకైన మార్పులు తీసుకువచ్చారని వెల్లడించారు. పేదవాడు ఉన్నత చదువులు చదవాలి... రైతు మోములో చిరునవ్వు చూడాలనే సంకల్పంతో సీఎం జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు అధికార కాంక్షతో ఇరుకు రోడ్లతో సభలు పెట్టి అమాయక ప్రజలను బలితీసుకుంటున్నారని ఆరోపించారు. సీఎం జగనన్న మానవత్వంతో కందుకూరులో మృతి చెందిన వారికి ఆర్థిక సాయం ప్రకటించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు చిన్న చిన్న విభేదాలు ఉన్నా పక్కన పెట్టి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు సుకుమార్ ,రమణప్రసాద్ రెడ్డి, సర్పంచ్ కవిత, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, వైద్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలారు ప్రకాష్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, పారిశ్రామిక వేత్త రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు రోశిరెడ్డి, గురవారెడ్డి, మాజీ సర్పంచ్‌లు హేమశేఖర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, పొన్నయ్య, భూపాలయ్య పాల్గొన్నారు.

చదువే ఉన్నత శిఖరాలకు సోపానం



విద్యార్థులకు పుస్తకం గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: సంస్కారవంతమైన చదువే ఉన్నత శిఖరాలకు సోపానమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిల్లలకు ఉద్బోధించారు. మానవ వికాస వేదిక వారు ప్రచురించిన 'ఆరడుగుల నేల' కథల పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం రాత్రి జీవకోన, క్రాంతి నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయం(బాలికల వసతి గృహం)లో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతుల మీదుగా పిల్లలకు పుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి గొప్ప రచయితలు రాసిన చిన్న చిన్న కథలే ఈ ఆరడుగుల పుస్తకం అని తెలిపారు. పేదరికం, డబ్బు లేకున్నా పట్టుదలతో చదివి ఎంతో గొప్పవారుగా నిలిచారని గుర్తు చేశారు. ఇందుకు నిదర్శనం కనీసం శరీర కదలికలు సరిగా లేని స్టీఫెన్ హాకింగ్ విశ్వంలోని రహస్యాలను కనుగొని ఖ్యాతి గడించారని తెలిపారు. ఇలాంటి గొప్పవారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి, మంచితనంతో ఎదగాలని సూచించారు. మంచితనంతో కలిసి జీవిస్తూ తోటి మనుషులకు సాయం చేస్తూ సంస్కార వంతమైన జీవితాన్ని సాగించాలని పిలుపునిచ్చారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సమాజంలో మానవీయతను పెంచి పోషించాలన్న తపనతో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం శుభపరిణామమన్నారు. పిల్లలు బాగా చదువుకొని జీవితంలో ఉత్తములుగా ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక సమన్వయ కర్తలు శైలకుమార్, సాకం నాగరాజు, శ్రీమన్నారాయణ, సాకం ప్రభాకర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయం నిర్వాహకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామిని కించపరిచిన వారిని శిక్షించాలి



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న అయ్యప్ప భక్తులు

పుంగనూరు: హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా శబరిమలై అయ్యప్పస్వామిని దూషించిన బైరీ నరేష్‌పై కేసు నమోదు చేసి, శిక్షించాలని పలువురు అయ్యప్ప స్వాములు పట్టణంలో ఆందోళన చేపట్టారు. శనివారం హిందూజాగరణ సమితి, శ్రీధర్మ శాస్త్రసేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి హిందూ జెండాను కట్టారు. బైరీ నరేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఐ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఆర్వో తదితరులు

తిరుపతి అర్బన్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ప్రభుత్వ సేవల్లో రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. మరింత ఉత్సాహంతో మొదటి స్థానంలో నిపుదామని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైజేపీ.ప్రసాద్ రెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ, మహిళా వింగ్ అధ్యక్షురాలు శాంతిదుర్గ, సభ్యులు మధుబాబు, పురుషోత్తంరెడ్డి, సుబ్బారాయుడు, రాజేష్, రవికుమార్, రమేష్‌రెడ్డి, రేవతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

పలమనేరు: మండలంలోని సాకేవూరు వద్ద పలమనేరు–కుప్పం రహదారిపై కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బైరెడ్డిపల్లి మండలం, లక్కనపల్లికి చెందిన వెల్డర్ వసీం(23) సొంత పనిపై పలమనేరుకు బయలుదేరాడు. సాకేవూరు వద్ద బైరెడ్డిపల్లివైపు ఎదురుగా వస్తున్న కారు వేగంగా బైక్‌ను ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయాలైన వసీం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పలమనేరు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాష్ట్రంలో విద్యావిప్లవం

- రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి
- అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు

సాక్షి, చిత్తూరు: రాష్ట్రంలో విద్య, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి తెలిపారు. శనివారం డీఆర్డీఏ సమావేశపు మందిరంలో ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంతో చిత్తూరు, పలమనేరు, జీడీనెల్లూరు, పూతలపట్టు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 20 మంది ప్రతిభావంతులైన 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ స్కాలర్ షిప్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వచ్చే ఏడాదిలో కూడా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తారన్నారు. ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో జిల్లాలో వంద మినరల్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. చిత్తూరు నగర మేయర్ అముద మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. డీఈఓ విజయేంద్రరావు, చిత్తూరు నగర డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పిల్లలకు ప్రోత్సాహకంగా స్కాలర్ షిప్‌లు అందించడం సంతోషంగా ఉందన్నారు. నాటా సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపట్టామని, విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్ల పంపిణీతో పాటు విద్యాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సౌమ్య, పూజిత, రోహిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాఠశాలల్లో అమలు చేస్తున్న పథకాలు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న జ్ఞానేంద్రరెడ్డి, మేయర్ అముద, డీఈఓ విజయేంద్రరావు తదితరులు


విద్యా సంస్కరణల్లో.. జగనన్న దేశానికే ఆదర్శం



ట్యాబ్‌లు అందుకున్న చిన్నారులతో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

చంద్రగిరి: విద్యా సంస్కరణల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఏ.రంగంపేట, చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. చంద్రగిరిలో 706, చిన్నగొట్టిగల్లులో 184, పాకాలలో 467, రామచంద్రాపురంలో 333, తిరుపతి రూరల్‌లో 716, తిరుపతి అర్బన్‌లో 176, ఎర్రావారిపాళెం మండలంలో 365 ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. వీటికోసం ప్రభుత్వం రూ. 9,45,63,336 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక



బాలుర జట్టు



బాలికల జట్టు

పెద్దపంజాణి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 వాలీబాల్ బాల, బాలికల జిల్లా స్థాయి జట్లను శనివారం ఎంపిక చేశారు. మండలంలోని నిడిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీలను జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 336 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ చాటిన 15 మంది విద్యార్థులను బాలుర జిల్లా జట్టుకు, మరో 15 మంది విద్యార్థినులను బాలికల జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను హెచ్ఎం నౌషాద్, పీడీ శివ ప్రకటించారు.

రూ.3.5 లక్షల కర్ణాటక మద్యం పట్టివేత



నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పోలీసులు

– ఐదుగురు నిందితుల అరెస్ట్

గంగవరం: కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఐదుగురు నిందితులను గంగవరం పోలీసులు బెంగళూరు హైవేలోని దండపల్లి బైపాస్ రోడ్డు వైఎస్సార్ జంక్షన్ వద్ద శనివారం అరెస్ట్ చేశారు. నిందితులను పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గంగవరం పోలీస్ స్టేషన్ వద్ద అరెస్ట్ చూపించారు. డీఎస్పీ కథనం.. పలమనేరు నియోజకవర్గ పరిధిలోని గంగవరం, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాలకు చెందిన పలువురు కర్ణాటక రాష్ట్రంలోని మద్యం దళారీలతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడి నుంచి ఏపీకి మద్యం తరలించి అధిక ధరలకు విక్రయించేవాళ్లు. కొన్నేళ్లుగా ఈ తంతు కొనసాగుతోంది. ఈ క్రమంలో కర్ణాటకలోని తాయిలూరుకు చెందిన వ్యక్తి ద్వారా రూ.3.5 లక్షల విలువ చేసే 30 కేసులు మద్యం బైక్, కారులో నింపుకుని బెంగుళూరు హైవేపై వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, పోలీసు, ఐడీ పార్టీ సిబ్బందితో కలిసి దండపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ముందు వస్తున్న బైక్‌ను ఆపగా వెనుక కూర్చున్న వ్యక్తి పారిపోయాడు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా బైక్‌లో రెండు కేసులు, వెనుక కారులో 28 కేసుల మద్యాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే నిందితులు బైరెడ్డిపల్లి మండలానికి చెందిన శ్రీనివాసులు, మహిందర్, హుస్సేన్ బాషా, ప్రతాప్, గంగవరం మండలానికి చెందిన మనోజ్, పలమనేరు మండలానికి చెందిన చిన్నరెడ్డెప్ప మొత్తం ఆరుగురిలో ఒకడు పారిపోగా మిగిలిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం రవాణాకు ఉపయోగించిన కారు, బైక్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



బాలికల జట్టుతో ఉపాధ్యాయులు

రామకుప్పం(శాంతిపురం): ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 షూటింగ్ బాల్ జట్లను శనివారం రామకుప్పం గురుకులంలో ఎంపిక చేశారు. బాలికల జట్టుకు నాగమ్మ, డిల్లీ హిమజ, రెడ్డిమౌనిక, నందిని, తేజశ్రీ, కీర్తి, వి.సంధ్య, ఎం.సంధ్య, కల్పన, పద్మిని, పీఎస్ మౌనిక, లిఖిత ఎంపికయ్యారు. బాలుర జట్టుకు సుధీర్, భానుప్రకాష్, వెంకీ, సంజయ్, నిరంజన్, మదన్, దిలీప్, అనిల్, ఎం.మదన్, ఫరీద్ అహ్మద్, ప్రవీణ్, ధరణి ఎంపికైనట్టు ఆర్గనైజర్ రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్సూర్ ఆలీ, తులసీరాం, నరేష్ పాల్గొన్నారు.

తుమ్మలగుంటకు
ఆధ్యాత్మిక శోభ



విద్యుద్దీపకాంతులీనుతున్న తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయం

కల్యాణ వెంకన్న ఆలయంలో నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

- కనులపండువగా పుష్పాలంకరణ
- ఆకట్టుకుంటున్న స్వాగత తోరణాలు
- భక్తుల కోసం పకడ్బందీగా వసతులు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తుమ్మలగుంట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పెద్దసంఖ్యలో విచ్చేయనున్న భక్తుల కోసం కల్యాణ వెంకన్న ఆలయంలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. రద్దీకి తగ్గట్లు క్యూల వద్ద పటిష్ట భద్రత కల్పించారు. గ్రామ శివార్లలోనే వాహనాలు పార్కింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టారు.

నిరంతర పర్యవేక్షణ

వెంకన్న దర్శనానికి తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. కరోనా నిబంధనలు పాటించేలా జాగ్రత్తలు చేపడుతున్నారు. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి హర్షిత్ రెడ్డి సైతం భక్తులకు వసతులు సమకూర్చడంలో నిమగ్నమయ్యారు.

ప్రత్యేకంగా పార్కింగ్

స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల వాహనాలకు టీటీడీ డెయిరీ ఫామ్ ఆవరణలో స్థలం కేటాయించారు. అలాగే తుమ్మల గుంట చెరువు వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

విశేషాలంకరణ

వెంకన్న ఆలయంలో భక్తులకు వైకుంఠ ద్వారం దర్శనం కల్పించేదుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సింగపూర్ నుంచి తెప్పించిన మెత్తని కుషన్ పరిచి, చుట్టూ దేవలోకం ను తలపించేలా సువాసనను వెదజల్లె పూలు,పండ్లతో వైకుంఠ ద్వార మార్గాన్ని అందంగా అలంకరిస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో విద్యుద్దీపాలతో కటౌట్లు ఏర్పాటు చేశారు.




విశేష పుష్పలంకరణతో స్వాగత ద్వారం, సుగంధ సుమాలతో తీర్చిదిద్దిన మండపం

ఉందిలే మంచి కాలం !

- గడిచిన మూడేళ్లు కరోనా గాయాలే..
- చేదు జ్ఞాపకాలను పీడకలగా మరిచిపోదాం
- కొత్త ఆశయాలు, లక్ష్యాలకు ఊపిరి పోద్దాం
- సంబరాల మధ్య 2023కు ఘన స్వాగతం

గడిచిన మూడేళ్లు కరోనా మహమ్మారి కుంగదీసింది. అందరి జీవితాలను తారుమారు చేసింది. ఆశయాలు, ఆలోచనలను కాలరాసింది. వైరస్ ప్రభావం నుంచి కోలుకుంటున్న తరుణంలో ఫోర్త్‌వేవ్ రూపంలో కలవరపెడుతోంది. గతం మిగిల్చిన చేదు జ్ఞాపకాలను పీడకలగా మరిచిపోదాం. కొత్త ఆశలు, సరికొత్త ఆశయాలకు ఊపిరిపోద్దాం. నిస్పృహను వీడి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగుదాం. కష్టమైనా.. ఇష్టంగా శ్రమించి విజయ బావుటా ఎగురవేద్దాం.. సానుకూలతనే సోపానంగా మలుచుకుందాం.. నిబంధనలు పాటిస్తూనే.. 2023కి ఘన స్వాగతం పలుకుదాం. – చిత్తూరు కలెక్టరేట్



ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఉండాలి



లక్ష్యం లేని జీవితం వృథా. జీవితంలో కలిసే కొత్త వ్యక్తులు, చేసే కొత్త ప్రయాణాలు మనకు ఎన్నో అనుభూతులు నేర్పుతాయి. నూతన సంవత్సరంలో చిత్తూరు జిల్లా ప్రజలందరికీ మేలు కలగాలని కోరుకుంటున్నాను. హ్యాపీ న్యూ ఇయర్. – హరినారాయణన్, కలెక్టర్, చిత్తూరు

గడిచిన క్షణాలు తిరిగి రావు



గడిచిన క్షణాలు తిరిగి రావు. విలువైన కాలాన్ని వృథా చేయొద్దు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఉన్నత విద్య పూర్తిచేసుకున్న వారు ఉద్యోగాలు పొందేలా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. తిరుపతి జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. – వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

కోవిడ్ నిబంధనలు తప్పనిసరి



మళ్లీ ఫోర్త్ వేవ్ అంటున్నారు. ప్రజలంతా ముందు జాగ్రత్తతో అడుగులు వేయాలి. కోవిడ్ నిబంధనలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలి. ఎక్కువ మంది ఒకచోట గుమికూడకూడదు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలి. – ప్రకాశం, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

యువత చేతుల్లోనే దేశ భవిత



బంధాలు, అనుబంధాలకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యమివ్వాలి. అందరికీ ఆమోదం కలిగించేలా వ్యవహరిస్తే మనలోని సామాజిక స్పృహ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. గతాన్ని మరిచి కొత్త సంవత్సరంలో సరికొత్త నిర్ణయాలతో యువత అడుగులు వేయాలి. –డా.ఎస్.వెంకటేశ్వర్, జాయింట్‌కలెక్టర్, చిత్తూరు

సరికొత్త లక్ష్యాలతో..



జిల్లాలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. 2023లో సరికొత్త లక్ష్యాలను పెట్టుకున్నాం. సైబర్ క్రైమ్‌తో సరికొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంది. చిత్తూరులో రూ.60 లక్షలతో డిజిటల్ లెర్నింగ్ స్కూల్ ఏర్పాటు చేయనున్నాం. – రిశాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

ఆరోగ్య సూత్రాలు మరువొద్దు



ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించడం అవసరం. కరోనా కట్టడికి ప్రభుత్వం, వైద్యులు ఎంతో కష్టపడి పనిచేశారు. కాలానుగుణంగా ఆహార, జీవన శైలిలో తగిన మార్పులు చేసుకోవడం కీలకమే అన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. – శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



నూతన సంవత్సర సంబరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు. చీటింగ్, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి కలగాలని కోరుకుంటున్నా.– పరమేశ్వరరెడ్డి, ఎస్పీ, తిరుపతి

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



యువత దురలవాట్ల నుంచి దూరంగా ఉండాలి. వ్యసనాలకు బానిస కాకూడదు. బాధ్యతలు ఎరిగి ముందుకు సాగాలి. సర్కారు బడులు ఎంతో అభివృద్ధి చెందాయి. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ నవ వసంతం కావాలి. – విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

సరి'కొత్తగా సాగుదాం'



కొత్త సంవత్సరంలో ఉత్తమ వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించనున్నాం. తిరుపతి జిల్లాలోని పెళ్లకూరు మండలంలో 100 ఎకరాల్లో పొలంబడికి సంబంధించి రైతులకు శిక్షణ ఇస్తున్నాం. ఆర్ఎన్ఆర్ 15048 వరి రకాన్ని ప్రోత్సహిస్తున్నాం. –ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, తిరుపతి

చెడును వీడాలి



యువత చెడు అలవాట్లను వదిలేసి మంచిని కోరుకోవాలి. తోటి వారికి చేతనైన సాయం చేయాలనే ఆలోచన పెంచుకోవాలి. పేదలు, ఆపదలో ఉన్న వారికి ఆప్తులుగా మెలగాలి. కొత్త సంవత్సరంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాలి. – ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ, చిత్తూరు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



పర్యావరణానికి హానికలిగితే అనేక సమస్యలు ఎదురవుతాయి. అరుదైన పక్షిజాతులు కనుమరుగవుతాయి. పర్యావరణ పరిరక్షణకు నూతన సంవత్సరం ఆరంభాన్ని సదవకాశంగా యువత మలుచుకోవాలి. విస్తృతంగా మొక్కలు నాటాలి. – నేచర్ మురళి, నేచర్ లవర్స్ అసోసియేషన్ ఫౌండర్, చిత్తూరు

వర్తమానానికి పునాది గతమే కదా!



మన సంతోషాలు 2022లో మరింత రెట్టింపు కావాలంటే 2023 సంవత్సరపు నిర్ణయాలను మరొకసారి స్మృతిపథంలోకి తెచ్చుకోవాల్సిందే. చేసిన తప్పొప్పులను నిజాయితీగా అంగీకరిస్తూనే సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలి. – నారాయణరెడ్డి, విద్యావేత్త, తిరుపతి

క్లుప్తంగా

కోటమలై ఆలయం ముస్తాబు



అయ్యప్ప ఆలయం

సదుం: నూతన సంవత్సరాదికి మండలంలోని పలు ఆలయాలను ముస్తాబు చేశారు. ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్ప ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కొత్తపల్లె శ్రీవారిపాదక్షేత్రం, సదుం సాయిబాబా ఆలయం, బూరగమంద భూదేవి, శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి నేడు తిరుమల రాక

తిరుపతి అర్బన్: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ శాంభాజి షిండే ఆదివారం తిరుమలకు వస్తున్నట్లు తిరుపతి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముంబయి ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి సాయంత్రం 6.15గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని చెప్పారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 7.30గంటలకు తిరుమల పద్మావతి అతిథిగృహానికి చేరుకోనున్నారని తెలిపారు. రాత్రి తిరుమలలో బసచేసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ముంబయికి తిరుగు ప్రయాణం కానున్నారని వెల్లడించారు.

రేపటి నుంచి ఫేస్ యాప్ అమలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో సోమవారం నుంచి ఫేస్ యాప్ ద్వారా ఉద్యోగులు అటెండెన్స్ ఉంటుందని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. తొలుత జిల్లా కేంద్రంలోని డీఆర్‌లు, డీఐజీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఉద్యోగులు ఇందులో అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. వారి ఫోన్‌లోని యాప్ ద్వారా కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు లాగిన్ అయ్యి సాయంత్రం 5 గంటలకు లాగ్‌అవుట్ అవ్వాలన్నారు. ఒకవేళ ఉద్యోగులు సెలవు పెడితే యాప్‌లో తెలపాలని చెప్పారు. జిల్లాలోని మిగిలిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జనవరి 16 నుంచి యాప్ అమల్లోకి వస్తుందన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



శ్రీదేవిభూదేవి సమేత తిరుచ్చిపై ఊరేగుతున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారిని తిరుప్పావైతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణం చేశారు. వివాహం కాని యువతీ, యువకులు ప్రత్యేక పూజలు చేసి కంకణాలు ధరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవను చేపట్టారు. తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, వీఐ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మిల్లెట్స్ బొకేలు



చిరుధాన్యాలు, పుష్పాలతో తయారుచేసిన బొకేలను కొనుగోలు చేస్తున్న మహిళలు

తిరుపతి తుడా: ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు, ఎదుటివారిని మెప్పించేందుకు వారి అభిరుచులకు తగ్గట్టు ఎప్పటికప్పుడు వ్యాపారులు కొత్త తరహా ఫల, పుష్పాలతో బొకేలను అందుబాటులో ఉంచుతారు. అయితే ఈ ఏడాది ఏర్పాటు చేసిన బొకేలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో తిరుపతి లోని బ్లూ పెటల్స్ ఆ నిబంధనలను పుణికిపుచ్చుకుని, తృణధాన్యాలతో సూపర్ ఫుడ్ బొకేలను తయారు చేసి విక్రయానికి ఉంచింది. కొనుగోలు దారులను ఇవి విశేషంగా ఆకట్టుకున్నాయి.వీటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు రూ.500 పైన బొకేలను కొన్నవారికి మల్టీమిల్లెట్ పౌడర్‌ను ఉచితంగా అందజేస్తున్నట్టు బ్లూ పెటల్స్ అధినేత సాయి తెలిపారు.



తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో మంచానికే పరిమితమైన వృద్ధురాలికి వైద్యం చేస్తున్న సిబ్బంది, మరో వృద్ధురాలికి అందుతున్న సేవలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి





పాఠశాలలో విద్యార్థినులకు షుగర్ పరీక్షలు చేస్తున్న ఆశా వర్కర్లు



కాలు కదపలేకున్నా... మంచం దిగలేకున్నా..!



కాలు కదపలేకున్నా, మంచం దిగలేకున్నా ప్రభుత్వం వైద్యం ముంగిట్లోకి వస్తోంది. గ్రామీణ వైద్యం నిర్లక్ష్య జాడ్యం నుంచి తక్షణ చికిత్స స్థాయికి చేరింది. వైద్యుల్లో అలసత్వం కనుమరుగై అప్రమత్తత దర్శనమిస్తోంది. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా, అవసరానికి మించి నిల్వ పెరిగింది. చంటి బిడ్డలు, దివ్యాంగులు, వృద్ధులు పట్టణాలు, నగరాలకు వెళ్లకుండానే వ్యాధి నిర్ధారణ జరుగుతోంది. తీవ్రత ఏంటో తెలుస్తోంది. తగిన వైద్యమూ అందుతోంది. గతంలో ఎప్పుడూ మూతపడి ఉండే ఆరోగ్య కేంద్రం.. ఇప్పుడు పగలంతా తెరిచే ఉంటోంది. ఖరీదైన వైద్యం కంటే ఉచిత వైద్యమే బాగుందన్న ప్రశంస వినపడుతోంది.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి/చిత్తూరు రూరల్

- పేదల కోసం పల్లెబాట పట్టిన వైద్య సిబ్బంది
- 14 రకాల పరీక్షలు.. పలురకాల వైద్య సేవలు
- అక్కడికక్కడే రోగులకు అన్ని రకాల మందుల పంపిణీ
- గతేడాది అక్టోబర్ 21 నుంచి అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్
- పరీక్షలు, వైద్యసేవల్లో ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు

మూడున్నరేళ్ల క్రితం వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళితే ప్రజలు నరక యాతన అనుభవించేవారు. అక్కడ డాక్టర్ ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి. ఇక వసతులు, మందుల కొరత విపరీతంగా ఉండేది. వైద్యులు కొందరు ఉదయం 10 లేదా 11 గంటలకు వచ్చినా, మధ్యాహ్నం 2 గంటలకే తలుపులు మూసుకుని వెళ్లేవారు. మొత్తంగా అప్పట్లో వైద్య సేవల్లో నిర్లక్ష్య జాడ్యం పట్టిపీడించేది. జబ్బుచేస్తే అప్పు చేసి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేలు, లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీంతో నాడు ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం ఉండేది కాదు.

నేడు పేదలకు ఆరోగ్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నాడు–నేడు పేరుతో ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ జబ్బులతో ఆస్పత్రికి వచ్చేవారికి అవసరమైన మందులు, మాత్రలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ఎన్నడూ లేని విధంగా పీహెచ్‌సీలోనే సుఖ ప్రసవాలకు శ్రీకారం చుట్టారు. వైద్యులు ఆస్పత్రిలో ఉండేలా ఫేషియల్ అటెండెన్స్‌ను తీసుకొచ్చారు. జబ్బుచేస్తే పట్టణాలకు పరుగులు తీసే పరిస్థితి లేకుండా, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి పల్లె ముంగిటకే వైద్య సేవలను తీసుకొచ్చారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌తో హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తూ... లేవలేని స్థితిలో ఉంటే 104 వాహనంతో ఇంటికే వెళ్లి వైద్యం చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫ్యామిలీ ఫిజీషియన్ వివరాలు

మొత్తం విలేజ్ క్లినిక్‌లు	904
విజిట్ చేసిన క్లినిక్‌ల సంఖ్య	894
మొత్తం ఓపీ కేసులు	1,48,140
జనరల్ ఓపీ	91,826
ఫీవర్ కేసులు	0
ఏఎన్‌సీ	10,434
పీఎన్‌సీ	6,660
రక్తహీనత	1,236
బీపీ	22,196
షుగర్	20,154
క్యాన్సర్	597



చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులో వైద్యసేవలు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్



ఏర్పేడు మండలం కుక్కలగుంట గిరిజన కాలనీలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఫ్యామిలీ డాక్టర్ గ్రామాల్లో అందించే సేవలు

- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటినేటల్ చెకప్స్
- బాలింతలకు ప్రసవానంతర సమస్యల గుర్తింపు
- చిన్నపిల్లలకు పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు
- రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స చేసుకున్న రోగులకు అవసరమైన పరీక్షలు
- క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైనవారికి, వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలు
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ పరిశీలన

గ్రామాల్లోనే 14 రకాల పరీక్షలు

- గర్భం నిర్ధారణకు యూరిన్‌టెస్ట్
- హిమోగ్లోబిన్ టెస్ట్
- ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్)
- మలేరియా టెస్ట్ • హెచ్‌ఐవీ నిర్ధారణ
- డెంగ్యూ టెస్ట్
- మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్ స్టిక్)
- అయోడిన్ టెస్ట్ • వాటర్ టెస్టింగ్
- హెపటైటిస్ బి నిర్ధారణ
- ఫైలేరియాసిస్ టెస్ట్ • సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్
- విజువల్ ఇన్‌స్పెక్షన్ • స్పుటమ్ (ఏఎఫ్‌బి)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో...

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	పీహెచ్‌సీలు
904	106
ఫ్యామిలీ వైద్యులు 198	104 వాహనాలు 33 (ఫ్యామిలీ డాక్టర్లకు కేటాయించినవి)

జిల్లాలో 904 క్లినిక్‌ల పరిధిలో ప్రతి రోజు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలవుతోంది. ఉదయం 9గంటలకే షెడ్యూల్ ప్రకారం ఫ్యామిలీ డాక్టర్, ఏఎన్‌ఎం, ఎంఎల్ హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్, ఆశ వర్కర్లు 104 వాహనంలో గ్రామానికి వెళ్తున్నారు. మొదట విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. అక్కడకు వచ్చిన వారందరికీ బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఎత్తు, బరువు కొలుస్తున్నారు. వారందరి వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని డాక్టర్ సూచనలతో మందులు, మాత్రలు ఇస్తున్నారు. అది కూడా నెలకు సరిపడా మందులు ఇస్తూ పేదలకు వైద్య భరోసా కల్పిస్తున్నారు.

వైద్య సేవలతో పాటు...

పేదలకు వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య బృందానికి మరిన్ని బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ప్రజలకు చికిత్స అనంతరం విధిగా గ్రామ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి విద్యార్థులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి మంచానికే పరిమితమైన వారిని, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స తీసుకున్న వారి వద్దకే వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నారు. హెచ్‌బీ (హిమోగ్లోబిన్), ఆర్బీఎస్, మలేరియా, డెంగ్యూ, వాటర్ టెస్టింగ్, ప్రెగ్నెన్సీ టెస్ట్, హెచ్‌ఐవీ, స్పుటమ్ ఫర్ ఏఎఫ్‌బీ, హెచ్‌బీఎస్ఏజీ వంటి పరీక్షలు చేస్తున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో భద్రపరుస్తున్నారు.

ప్రథమ స్థానంలో తిరుపతి

రక్తహీనత పరీక్షలు చేయడంలో తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. బీపీ పరీక్షలు చేయడంలో మూడో స్థానం, మధుమేహ పరీక్షల్లో ఐదవ స్థానంలో చిత్తూరు నిలించింది. ఇందుకు జిల్లా అధికారులను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించారు. నవంబరు 21న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 మంది వైద్యులను కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు..

ఈయన పేరు సుబ్రమణ్యం (70). ఏర్పేడు మండలం కుక్కలగుంట ఎస్టీ కాలనీలో ఉంటున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స తీసుకున్నా నడవటం కష్టంగా మారింది. ఈ పరిస్థితిలో ఇంటికే పరిమితమయ్యారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం సుబ్రమణ్యం పాలిట వరంలా మారింది. పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్య బృందం కాలనీకి వెళ్లి సుబ్రమణ్యంకి ఉచితంగా వైద్యం, మందులు ఇచ్చి వస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం వల్ల తనకు ఎంతో మేలు జరుగుతోందంటున్నారు.



సుబ్రమణ్యం ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది



దుర్గసముద్రం: వైఎస్సార్ హెల్త్‌కార్డులతో గ్రామస్తులు, వైద్యాధికారులు, సిబ్బంది



మంచంపై ఉన్న వృద్ధురాలికి వైద్యం అందిస్తున్న వైద్యురాలు

దుర్గసముద్రంలో ఆకస్మిక తనిఖీ

తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి ఆకస్మికంగా సందర్శించారు. క్లినిక్‌లో ఉన్న రోగులు, వైద్యులతో మాట్లాడారు. మంచానికే పరిమితమైన పి ధర్మయ్య, క్రిష్ణమ్మ, కాంతమ్మ నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలోని మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కొందరు విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి, వైద్యురాలు ఉదయశ్రీ, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, 104 సిబ్బంది తదితరులు ఉన్నారు.



యాదమరి మండలం దాసరపల్లికి చెందిన పార్వతమ్మ నడవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమైంది. బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. వైద్య పరీక్షలు, సేవల కోసం రెండు నెలల ముందు వరకు చిత్తూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వచ్చేవారు. ఆమెకు తోడు మరొకరు కావాల్సి వచ్చేది. దీంతో పాటు ఆటో చార్జీలు అదనంగా భరించాల్సి వచ్చేది. అయితే రెండు నెలులుగా పార్వతమ్మకు ఆ ఇబ్బందులు తప్పాయి. ఫ్యామిలీ ఫిజీషియన్ అములుతో డాక్టర్లు ఇంటి వద్దకు వచ్చి ఈమెకు వైద్యం చేస్తున్నారు. నెలకు సరిపడా మందులు, మాత్రలు అందిస్తున్నారు. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు పర్యవేక్షిస్తున్నారు.

పూతలపట్టు మండలంలోని సాయి తలసేమియాతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. ఇతడి కుటుంబీకులు తిరుపతి రుయాకు తీసుకెళ్లి చికిత్స అందిస్తూ వచ్చారు. ఫిజియోథెరపీ కోసం పద్మావతి ఆసుపత్రికి వెళ్లేవారు. అయితే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో డాక్టరే ఇంటి వద్దకే వెళ్లి ఆ యువకుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మందులు, మాత్రలు అందిస్తున్నారు. దీంతో పాటు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.



సాయి నివాసానికి వెళ్లిన వైద్య సిబ్బంది

పేదల వద్దకే వైద్యం



ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వల్ల పేదల ప్రజలకు మేలు జరుగుతోంది. ఎక్కువగా ఇంటి పట్టునే ఉన్నా వైద్యం అందిస్తున్నాం. వృద్ధులు, బాలింతలు, గర్భిణులకు పల్లెలోనే సేవలు అందుతున్నాయి. వైద్యులు చేస్తున్న పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలను పక్కాగా ఆన్‌లైన్‌లో పొందపరుస్తున్నాం. వీటి ద్వారా ఎక్కడైనా సేవలను పొందవచ్చు.

– హర్షవర్ధన్, పీహెచ్‌సీ వైద్యులు, పాపానాయుడుపేట

పక్కాగా అమలు చేస్తున్నాం



గత ఏడాది అక్టోబర్ 21న కుటుంబ వైద్యవిధానం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 23 రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సేవలను అమలు చేస్తున్నాం. విశేష స్పందన ఉంది. సేవలను పక్కాగా అమలు చేసేలా చూస్తున్నాం. ఆశయాల మేరకు పనిచేయాలని వైద్యులకు ఆదేశించాం. ఈ విషయంలో నిర్లక్ష్యం లేకుండా వైద్యులు పనిచేస్తున్నారు. ఈ ఫలితంగా జిల్లాకు గుర్తింపు లభించింది. ఇలానే సేవలను కొనసాగించేలా చూస్తాం.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి జిల్లా

ప్రభుత్వ ఆశయం మేరకు సేవలు



ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. పల్లెకు డాక్టర్‌ని పంపించి వైద్య సేవలు అందించేలా చేస్తున్నాం. ఆ సేవల్లో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకున్నాం. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వ ఆశయం మేరకు వైద్యసేవలు అందిస్తున్నాం. ఈ విధానాన్ని పల్లె ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రకాశం, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

బోయకొండలో మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మను శనివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖామంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కరోనా మహమ్మారి నుంచి రాష్ట్ర ప్రజలను రక్షించాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఉన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్

బోయకొండ గంగాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డిష్ సూరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాపీ న్యూ ఇయర్ భారీ కేక్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కత్తిరించారు. 2023 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లద్దూరమణ, కొలింపల్లె గంగిరెడ్డి ఆధ్వర్యంలో దిగువపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జన్మభూమి కమిటీ మెంబర్లు శ్రీరాముల నాయుడు, మొగరాల అరుణ, మహేష్, జయమ్మ, భారతమ్మ, వీరి అనుచరులు యానాదిపాళ్యంలో బొగ్గటి దొరస్వామి, రమేష్‌బాబు, కొలింపల్లె టీడీపీ నేతలు మురళి, రెడ్డెప్పతోపాటు మరో ఇరవై మంది ఉన్నారు.



బోయకొండ గంగాపురంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి